క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్ అండ్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఐతరాజు సుధాకర్ ఆదివారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఒక్కో గ్రూప్‌లో 40 మంది చేరేందుకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత 10వ తరగతి మెమో జీరాక్స్, కుల ధ్రువీకరణ సర్టిఫికేట్‌లను కళాశాలలో ఇవ్వాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9666665733, 9618066948 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

జూలూరి గౌరీశంకర్ పరామర్శ



వెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న గౌరీశంకర్

అనంతగిరి : మండలంలోని మొగలాయి కోటలో ఇటీవల మృతి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ సింగిరెడ్డి వెంకటరెడ్డి కుటుంబాన్ని ఆదివారం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మునగాల : రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ మునగాల మండల నూతన కమిటీని మండల కేంద్రంలోని ది మునగాల పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎరుకల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా దాచేపల్లి మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిరందాసు ఉపేంద్రాచారి, కోశాధికారిగా సీహెచ్.బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ ఖాదర్‌లను ఎన్నుకున్నట్లు రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ మండల శాఖ మాజీ అధ్యక్షుడు లేళ్ల లింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పానుగోటి భుజంగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్నగౌడ్, క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు వెంకటప్పయ్య, తాళ్లపల్లి భాస్కర్, నడిగూడెం మండల అధ్యక్షుడు నాగరాజు, రవి బాబు, లింగయ్య, వెంకటప్పయ్య చారి, రజినీకాంత్, లాలు, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇస్తున్న 108 సిబ్బంది

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో అత్యవసర వైద్య సేవలు అందించే 108 సిబ్బందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని ఆదివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సైదిరెడ్డిని వారు కలిసి కోరారు. ఈమేరకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం తరపున ఇళ్లస్థలాల మంజూరుకు కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రవిబాబు, సుధాకర్, రవి, ప్రియాంక, బిక్షం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సభ్యులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని అల్వాలపురంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సమితి సభ్యులు వారు మాట్లాడుతూ సమాజంలో కులమతాల తారతమ్యాలను రూపుమాపడానికి, ప్రజల మధ్య అసమానతలను తొలగించడానికి భగవద్గీత జ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఇంటిలో భగవద్గీత ఉండాలని, చదవాలని కోరారు. కార్యక్రమంలో పోటు వెంకటేశ్వర్లు, జాస్తి శివరామకృష్ణ, ముత్తవరపు శైలజ, వంగాల మహేష్, రాము, అరుణ, నరసింహారావు ఉన్నారు.

చర్చలు సఫలం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ కూరగాయల మార్కెట్ హమాలీ కూలి రేట్ల పెంపుపై జరిగిన చర్చలు సఫలమైనట్లు నియోజవర్గ కార్మిక సంఘం నాయకుడు పి.ఉపేందర్ తెలిపారు. ఆదివారం పట్టణంలో కూరగాయల హోల్ సేల్ వ్యాపారులకు, హమాలీ కార్మికులకు మధ్య కూలి రేట్ల పెంపుపై చర్చలు జరిగినట్లు ఆయన చెప్పారు.

చికెన్ ధరలు పైపైకి..

- భారీగా పెరిగిన చికెన్ రేట్లు
- స్కిన్‌తో కిలో రూ.240, స్కిన్ లెస్ రూ.260గా అమ్మకాలు
- కోళ్ల దాణా ఖర్చు రెట్టింపు కావడంతో తగ్గించిన ఉత్పత్తి



కోదాడ రూరల్ : పేద, మధ్యతరగతి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే మాంసహారమైన చికెన్ ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ప్రతి ఏడాది వేసవి కాలంలో తగ్గే ఈ చికెన్ ధరలు ఈ ఏడాది మాత్రం భగ్గుమంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో స్కిన్‌తో కిలో చికెన్ ధర రూ.240 పలుకుతోంది. అలాగే స్కిన్ లెస్ చికెన్ ధర రూ.260 వరకు ఉంది. ఇంతలా గతంలో ఎన్నడూ పెరగలేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో సామాన్యులు చికెన్ కొనేందుకు వెనుకాడుతున్నారు. ఇక గ్రామాల్లోని ప్రజలు చికెన్ కొనలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా తాము చికెన్ అమ్మలేక షాపులు మూసేసుకుంటున్నామని వ్యాపారులు వాపోతున్నారు. అయితే ఈ ఏడాది జనవరిలో స్కిన్‌తో కిలో చికెన్ ధర రూ.180, స్కిన్‌లెస్ రూ.200 ఉండగా ప్రస్తుతం రూ.240 నుంచి రూ.260 వరకు ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రూ.300 మార్క్ చేరే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

ఎండల ప్రభావంతో..

కరోనా తర్వాత ప్రజలు మాంసాహార వాడకం పెంచారు. మాంసహారంలో కూడా చికెన్‌నే ఎక్కువగా వినియోగిస్తున్నారు. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో రికార్డు స్థాయిలో చికెన్ ధరల పెరుగుతున్నాయి. అంతే కాకుండా ఎండాకాలం కావడంతో పెరిగిన ఉష్ణోగ్రతలకు కోళ్ల ఎదుగుదలకు ఎక్కువ సమయం పడుతోంది. దీంతో పలుచోట్ల ఎండకు తట్టుకునేందుకు కోళ్లకు కూలర్లు, నీటి స్ప్రింక్లర్లు ఏర్పాటు చేశారు. ఇక కోళ్లకు దాణాగా ఉపయోగించే మొక్కజొన్న, సోయ, తవుడు వంటి వాటి ధరలు కూడా పెరిగాయి. ఈ ప్రభావాలన్నింటి కారణాలతో చికెన్ ధరలు భారీగా పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు.

కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో..



డిమాండ్‌కు సరిపడా కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతోనే చికెన్ ధరలు పెరగుతున్నాయి. ఈ ఏడాది సమస్య చాలా ఎక్కువగా ఉంది. ధరలు పెరిగిన కారణంగా చికెన్ అమ్మకాలు కొద్దిగా తగ్గాయి.

– గొర్రె నరేందర్, చికెన్ షాప్ నిర్వాహకుడు

వాడకాన్ని తగ్గించాం



గతంలో వారంలో రెండు రోజులూ చికెన్‌ను తినే వాళ్లం. ప్రస్తుతం పెరిగిన ధరలతో రెండు వారాలకు ఒకసారి మాత్రమే చికెన్ తీసుకెళ్తున్నాం. చికెన్‌కు బదులుగా చేపలు తెచ్చుకుంటున్నాం.

– మర్ల చంద్రశేఖర్‌రెడ్డి, కోదాడ

గుడ్డు ధర సైతం..

శాఖహారులు, మాంసహారులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ పౌష్టికాహారంగా తినే గుడ్డు ధర కూడా భారీగా పెరిగింది. రెండు నెలల కిందట హోల్‌సేల్‌గా రూ.4 గుడ్డు ధర నేడు రూ.5కు చేరింది. రిటైల్‌గా రూ.5 ఉన్న ధర ప్రస్తుతం రూ.6కు చేరుకుంది. వీటి ధరల పెరుగుదలకు కారణం దాణా, నిర్వహణ ఖర్చులు పెరగాడమేనని వ్యాపారులు పేర్కొంటున్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



క్రీడాకారులకు దుస్తులు అందజేసిన శ్రీనివాస్ రెడ్డి

హుజూర్‌నగర్ : క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చని జిన్నారెడ్డి ఫౌండేషన్ చైర్మన్ జిన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లోని వీవీఎం స్కూల్‌లో శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ క్రీడల వేసవి శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శాంతిరెడ్డి ఫౌండేషన్ అందించిన క్రీడా దుస్తులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాలీబాల్ క్రీడాకారులు, శాంతిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చందా సుధాకర్‌రెడ్డి, దండగల సీతారాం రెడ్డి, పీడీలు నాగమణి, శ్రీనివాస్ రెడ్డి, పీఈటీలు బ్రహ్మారెడ్డి, ప్రదీప్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



ఉత్సవాలకు సిద్ధం చేసిన యాగశాల

మఠంపల్లి : మండలంలోని వరదాపురంలో ఈనెల 29 నుంచి 31 వరకు గ్రామ దేవతలైన పెద్దమ్మ, ముత్యాలమ్మ, అంకమ్మ, ముత్యాలమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ బచ్చలకూరి అఖిల బాబు ఆదివారం తెలిపారు. గ్రామస్తుల సహకారంతో చేపట్టే ఈ ఉత్సవాలు వేద పండితులు బ్రహ్మశ్రీ రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాళ్లబండి రాజశేఖరశర్మల బ్రహ్మత్వమున జరుగుతాయన్నారు. 29న గణపతిపూజ, పుణ్యాహవచనం, హోమం, అంకురార్పణ, నవగ్రహపూజలు ఉంటాయన్నారు. 30న విగ్రహాలకు క్షీరాభిషేకం, జలాధివాసం, బలిహరణ, చతుర్వేద పారాయణాలు, నవగ్రహ, వాస్తు పూజలు, తీర్థ ప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు. 31న ఉదయం 8:12 నిమిషములకు శుభ ముహూర్తమున యంత్రబింబ స్థాపనలతో ప్రతిష్ఠ మహోత్సవాలు పూర్తి అవుతాయని తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

సురగాని వెంకటేశ్వర్లు మృతి బాధాకరం



వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మునగాల : మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సురగాని రాంబాబు గౌడ్ తండ్రి, పెద్ద గౌడ్ సురగాని వెంకటేశ్వర్లు మృతి బాధాకరమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వెంకటేశ్వర్లు చిత్రపటానికి నారాయణగూడెంలోని వారి నివాసంలో పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు సుంకర అజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు తొగరు రమేష్, మాజీ జెడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ తొగరు సీతారాములు, మాజీ ఎంపీటీసీ వీరారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లింగయ్య యాదవ్, నాగిరెడ్డి, ఎల్పీ రామయ్య, దొంగరి శ్రీనివాస్, పాషా, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు పరామర్శ

మండలంలోని రేపాలకు చెందిన మాజీ ఎంపీటీసీ బత్తుల ఉష భర్త, బీఆర్ఎస్ మండల పార్టీ నాయకుడు బత్తుల శ్రీనివాస్ ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలుకు తీవ్ర గాయమై ఇంటివద్ద చికిత్స పొందుతుండగా ఆదివారం ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పాముల రాఘవేందర్ ఉన్నారు.

పాచ్యానాయక్ సేవలు మరువలేనివి



పాచ్యానాయక్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

అనంతగిరి : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాచ్యానాయక్ చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. వడదెబ్బ కారణంగా అనారోగ్యంతో మృతి చెందిన బాణోతు పాచ్యానాయక్ మృతదేహానికి ఆదివారం మండలంలోని కొత్తగోల్‌తండాలో ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పద్మావతిరెడ్డి మాట్లాడుతూ పాచ్యానాయక్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కొత్తగోల్‌తండాలో కాంగ్రెస్ తరపున తన కుటుంబం నుంచి ముగ్గురు సర్పంచ్‌లు, ఒక జెడ్పీటీసీని అందించిన ఘనత పాచ్యానాయక్‌కే దక్కిందన్నారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన మొగలైకోట మాజీ సర్పంచ్ సింగారెడ్డి చిన్నవెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా, వేణు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మునగాలలో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

మునగాల : మండలంలో బీజేపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహించాలని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి గురించి ప్రజలకు తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రెణబోతు శ్రీనివాసరెడ్డి, నాయకులు వేముల వీరబాబు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు దాసరి మధు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి

మోతె : ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలని బీజేపీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకల పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో బూత్ కమిటీలు ప్రతిష్టంగా పనిచేసి 2024 లో బీజేపీని గెలిపించాలన్నారు. అనంతరం మన్ కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మోతె ఎస్ఐపై చర్య తీసుకోవాలి



నడిగూడెం : మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కిశోర్

నడిగూడెం : మోతె మండలం విభళాపురంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం పేదల పక్షాన శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులుపై దాడి చేసిన మోతె ఎస్ఐ మహేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిశోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు జమ్మి యల్లయ్య, నాయకులు నోసిన అంజి, వీరబాబు, సతీష్, వెంకి పాల్గొన్నారు.

సీపీఎం నాయకులపై దాడి హేయమైన చర్య

హుజూర్‌నగర్ : పేదల పక్షాన పోరాడుతున్న సీపీఎం నాయకులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోతె మండలం విభళాపురంలో పేదల పక్షాన ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులపై పోలీసులు చేసిన మూకుమ్మడి దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. సీపీఎం నాయకులు పల్లె వెంకటరెడ్డి, డి.బ్రహ్మం, వి.సైదులు, శ్రీను, వెంకటేశ్వర్లు, వీరమల్లు, పాల్గొన్నారు.

గరిడేపల్లి : మోతె మండలం విభళాపురంలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులుపై పోలీసులు దాడి చేయడాన్ని సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ ఖండించారు. ఆదివారం మండలంలోని కీతవారిగూడెంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఎం నాయకులు సైదయ్య, శ్రీనివాస్, రాజేష్, నారాయణ, పెంటయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

మఠంపల్లి : మోతె మండలం విభళాపురంలో అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిరుపేదలతో కలిసి ఆందోళన చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సైదులుపై స్థానిక ఎస్ఐ, పోలీసులు చేసిన దాడిని ప్రజాతంత్ర వాదులు, ప్రజాస్వామ్య వాదులు తీవ్రంగా ఖండించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాండు నాయక్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని, అక్రమంగా పేదలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులుపై అక్రమ కేసు బనాయించిన పోలీసులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని అమరవరంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ పార్టీ ప్రజాసంఘాల నాయకులు షేక్ కాశీం, కదిర రామ నర్సమ్మ, షేక్ సైదా, సీతారాములు, బాలసైదులు, కృష్ణారెడ్డి, వీరస్వామి, బాలసైదులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



మునగాల : సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు



చిలుకూరులో..

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981–82 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆ పాఠశాలలో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యురాలు నల్లపాటి ప్రమీల, సర్పంచ్ చింతకాయల ఉపేందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు శాఖమూడి కృష్ణయ్య, కొర్రా తులిశమ్మ, దేవరం వెంకటరెడ్డి, పూర్వ విద్యార్థులు నల్లపాటి శ్రీనివాస్, కర్నాటి సుధాకర్, ఎర్ర అంజన్ రెడ్డి, నర్రా ఇంద్రశేఖర్‌రెడ్డి, కుందూరు జనార్దన్‌రెడ్డి, అలుగుబెల్లి శ్రీనివాసరెడ్డి, ఎండీ.రషీద్, దేవరం శ్రీనివాసరెడ్డి, ఎనుగుల నాగేశ్వరరావు, గాడిపర్తి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

చిలుకూరు : చిలుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004– 2005 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం విద్య నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో..

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002– 2003 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం విద్య నేర్పిన ఆనాటి గురువులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, రంగారెడ్డి, సువర్ణ, చిన్నప్ప, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, పూర్వ విద్యార్థులు సతీష్, యుగేందర్, సోమిరెడ్డి, సైదులు, శ్రీకాంత్, సైదయ్య, భాస్కర్, చిరంజీవి, శేఖర్, గాంధీ, కిరణ్, నరేష్, రామకృష్ణ, సందీప్, ఫర్వీన్, జానీబేగం, కళ్యాణి, జ్యోతి, లక్ష్మి, జానకి, సంధ్య, రేవతి, సునిత తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో..

వేపలసింగారంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో గల ఆర్‌సీఎం పాఠశాలలో 2000–2001వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రం, చిన్నపరెడ్డి, స్లివారెడ్డి, విద్యార్థులు పెద్దారపు లెనిన్, శేఖర్‌రెడ్డి, శేకర్‌రావు, రాజ్యలక్ష్మి, కాశమ్మ, అనురాధ, కరుణమేరి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సీఎం ఎన్‌టీఆర్‌కు నివాళి



కోదాడరూరల్ : ఖమ్మం క్రాస్ రోడ్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



గరిడేపల్లి : పానుగోడులో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామాల్లో సినీ నటుడు, స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం క్రాస్ రోడ్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉప్పగండ్ల శ్రీనివాసరావు, నంబూరి సూర్యం, శోభన్ బాబు, సురేష్, రేవంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నల్లబండగూడెంలో..

మండలంలోని నల్లబండగూడెంలో ఎన్టీఆర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, ముంద్ర రంగారావు, మేకల ప్రతాప్, గోపి, నారాయణ తదితరులు ఉన్నారు.

యుగ పురుషుడు ఎన్‌టీఆర్

గరిడేపల్లి : ఎన్‌టీఆర్ యుగ పురుషుడు అని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని పానుగోడులో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జోగు అరవింద్‌రెడ్డి, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు జుట్టుకొండ సోమయ్య, మాజీ సర్పంచ్ నందిపాటి సైదులు, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రవి అభిమానులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ శత జయంతిని ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కొండా సోమయ్య, మండల ప్రచార కార్యదర్శి కొల్లు సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కొల్లు నర్సయ్య, గుండు వీరబాబు, శ్రీను, మస్తాన్, సైదిరెడ్డి, నాగరాజు, వెంకటయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

మండలంలోని రామాపురం, నారాయణపురం గ్రామంలో టీడీపీ నాయకులు ఎన్‌టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, వేమూరి సురేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలో దివంగత మాజీ సీఎం ఎన్‌టీఆర్ జయంతి వేడుకలను ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండు నాగేశ్వరరావు, నాయకులు ఎస్‌కే.జహీర్, రఫీ, సతీష్‌రెడ్డి, స్టాలిన్, రాములు, రామకృష్ణ, వెంకన్న, రబ్బాని, లింగయ్య పాల్గొన్నారు.

మునగాల : మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలను ఆదివారం మండలంలోని నర్సింహాపురంలో సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సామాజిక ఉద్యమకారుడు నరాల రుక్మారావు, బొమ్మ చినవెంకన్న, కారింగుల సైదులు, అల్లి చినరామయ్య, చెరువుపల్లి లింగయ్య, బాకి లక్ష్మయ్య, తొకల లక్ష్మయ్య, వీరబోయిన వెంకన్న, వీరస్వామి ఆశ్రమం నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ జయంతిని ఆదివారం హుజూర్‌నగర్‌లో టీడీపీ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి

గరిడేపల్లి : తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వారి ఆశయ సాధన కోసం యువత ఉద్యమించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండలంలోని గానుగబండ గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కడియాల వెంకయ్య 16వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కడియాల అప్పయ్య, ఆంజనేయులు, గోవిందు, గోవింద్‌రెడ్డి, సైదులు, తిరుపతయ్య, సైదులు, కాశయ్య, సాంబయ్య, ఇద్దయ్య, నర్సింహారావు తదితరులున్నారు.

లఘుచిత్రం చిత్రీకరణ



సినిమాలోని సన్నివేశం చిత్రీకరణ

గరిడేపల్లి : పల్లెల్లో ప్రజలకు సరైన వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్న వైనంపై తీస్తున్న లఘు చిత్రంలో భాగంగా ఆదివారం మండలంలోని కీతవారిగూడెంలో పలు సన్నివేశాలు చిత్రీకరించారు. నటీనటులు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి బాదె నర్సయ్య, ధర్మోరి, బాదె కావ్య, సైదమ్మ, రాములమ్మ, కెమెరామెన్ అభినవ్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మిర్చితోట ధ్వంసం

నాగారం : అన్నదమ్ముల మధ్య వైరం మిర్చితోట ధ్వంసానికి కారణమైన సంఘటన వర్ధమానుకోట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన పాక సురేష్ తన వ్యవసాయ భూమిలో మిర్చిపంటను సాగు చేస్తున్నాడు. మిర్చి పంట ఏరివేత దశలో ఉంది. అయితే అన్నదమ్ముల మధ్య మనస్పర్థల కారణంగా ఆయన సోదరులైన పాక గణేష్, పాక నరేష్‌లు మిర్చితోటను ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. ఈ విషయంపై పాక సురేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిర్చితోటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.